

ఆకలి

పాలడుగు వెంకటేశ్వరరావు

బాగా కొమ్మలూ రెమ్మలూ సాచి, విశాలంగా, ఏపుగా విస్తరించుకునివుంది; ఎత్తుగానూ పెరిగింది.

ఆ నిద్రగన్నేరుచెట్టు ! వూరికి ఉత్తరంగా రోడ్డు ప్రక్కనే, ఏకాకిగా నిలచివున్న ఆ నిద్రగన్నేరు చెట్టుకి దాపుల్లో, అటూ యిటూ మరే చెట్టూ చేమా లేదు. హేమంతంలో ఆకులు రాల్చి బోసిగానే నిలిచినా, దిగులుగానే మొహం పెట్టినా, వేసవి రాకముందే చిగుళ్లువేసి ఆకుల్ని తొడుక్కొని - ఎండలకాలం ఇంతచల్లని చక్కని నీడనీ, వానాకాలంలో కొంచమయినా రక్షణనీ యివ్వగలిగిన శక్తి ఆ నిద్రగన్నేరుకి వుంది. అందుకే పుట్టి బుద్ధెరిగిన దగ్గర్నుంచీ కనకయ్యకి ఆ చెట్టుక్రిందే నివాసం. వాడ్ని కొందరు కుంటికనకయ్య అంటారు. కనకయ్యకి ఒక కాలు కుంటిది. కుంటికాల్ని ఎగరేసి నడుస్తాడు. ఇంకొందరు వాడ్ని గుడ్డికనకయ్య అంటారు. వాడికి ఎడం కన్ను అసలు కనబడదు ! కనకయ్యని కన్న తల్లిదండ్రులెవరో కనకయ్యకే తెలియదు ! గాలికి పుట్టాడు. గాలిరూపు వచ్చింది. గాలికి పెరిగాడు. గాలికి కొట్టుకుపోతూ, వయస్సు ఆగదుగనక, మీసాలూ, గెడ్డాలూ వచ్చినా, గాలి మనిషిగానే గాలిబ్రతుకు బ్రతుకుతున్నాడాకనకయ్య.

సంజె చీకటి పడగానే వీధులవెంట పడతాడు. గొంతెత్తి బిగ్గరగా ఆర్తనాదాలు చేస్తాడు.

'అమ్మా ! అవిటోణ్ణి ! మాదాకబళం తల్లీ ! అన్నపూర్ణమ్మ తల్లీ గుడ్డిముండాకొడుకునమ్మా తల్లీ ! కుంటోడ్ని. ఇంత అన్నంముద్ద పెట్టు అమ్మా ! ఆకలితో సచ్చిపోతున్నాను తల్లీ !' కనకయ్య అరుపులకి గుండె కరిగిన ఏ తల్లో, మిగిలిపోయిన ఇంత చద్దిముద్ద పడేస్తుంది. అది తెచ్చుకుని తృప్తిగా తిని ఆ ప్రక్కనే వున్న పంపునీళ్ళుతాగి హాయిగా నోటికొచ్చిన పదాలు పాడుకుంటూ ఆ నిద్రగన్నేరు చెట్టు వడిలో అదమరచి నిద్రపోతాడు. తెల్లారిలేచి, మొహం కడుక్కొని, బస్టాండు దగ్గరో రయిల్వే స్టేషన్ దగ్గరో్న, అడుక్కొని నాలుగు పైసలు సంపాదించుకుని మూట గడతాడు. తిండివేళ దగ్గర పడేసరికి మళ్ళీ బజార్నపడి ఆక్రందనలు చేస్తాడు. ఏదన్నా దొరికితే తింటాడు. దొరకన్నాడు ఆ పైసలుపెట్టి టీ తాగి, కడుపులో కాళ్ళు పెట్టుకొని ముడుచుకుని కూర్చుంటాడు. ఆకలికి పేగులు గుడగుడ మంటాయి. చలికి వళ్ళు చిమచిమ మంటుంది. ఎండకి శరీరం చవటగారి జవజవలాడ్తుంది. అన్నిట్నీ అనుభవిస్తూ, ఎదురు తిరుగుతూ, పోరాడ్తూ, లొంగిపోతూ బాధపడుతూ, అట్లాగే, ముప్పయి సంవత్సరాల బ్రతుకును నెట్టుకు వచ్చాడు కనకయ్య. కడుపునిండిననాడు పండుగ. కడుపు ఎండిన రోజు కార్తీక సోమవారం. సుఖమూ, దుఃఖమూ, తృప్తీ, అసంతృప్తీ సంతోషమూ, దుఃఖమూ, ఆ ఎండిన మొండి బ్రతుకులోనూ, బండగా చోటు చేసుకోగా, ముప్పయి ఏళ్ళవయసుకే ముసలి రూపెత్తి, ముదివగ్గులాగా అయ్యాడు కనకయ్య.

రోజూలాగే ఆరోజూ— కాళ్ళరిగేట్లు బజార్లు తిరిగాడు కనకయ్య.

చీకటి పడినాక బజార్లవెంట దిరిగి- కాళ్ళు నొప్పులుపుట్టేట్టు నడిచి, గొంతు అర్చుకుని పోయేటట్లు అరిచి, ఆక్రోశించి, ఆకల్తో

అల్లాడి- గిజగిజలాడి- ఏమీ దొరక్కపోగా- నీరసంగా పంపుదగ్గర నీళ్ళుతాగి తన నిద్రగన్నేరు చెట్టుని ఆశ్రయించబోయిన కనకయ్యకి బోల్డుఆశ్చర్యం ఎదురయింది! ఆ వెంటనే కోపంతో కన్నులు ఎర్రబడ్డాయి, ఎన్నో ఏళ్ళుగా, తన ఆధీనంలో వున్న ఆ 'స్థలాన్ని' ఎవరో, దుర్మార్గంగా ఆక్రమించుకొని వున్నారు.

'ఏయ్! ఎవరెహే!?' కోపంగా అరిచాడు కనకయ్య.

ఆ నిద్రగన్నేరు చెట్టు మొదల్లో ఒక చిన్నమూటా, చిరుగుల చాపా, ఆనించివున్నాయి.

'ఏయ్! ఎవరంటే మాట్లాడవేంటెసా?! ఈ జాగానాదీ లేండి లేండి అవతలికి పోండశ!' అని కేకలు పెట్టాడు; కుంటికాలు ఎగరేసి చిందులు తొక్కాడు, కనకయ్య.

అప్పుడు, ఆచోటునుంచి సమాధానం వచ్చింది, కనకయ్యకి.

'అన్నా దిక్కులేనోళ్ళం. మాకూ్కడా కాత్త చోటియ్యి.'- ఒక ఆడగొంతు దీనంగా వేడుకుంది.

'ఎహె! దిక్కులేనోళ్ళకి దేముడే దిక్కు. లే. లే. పో. పోమ్మంటావుంటే నీక్కాదూ?'

'అన్నా. పిల్లలు కలదాన్ని. ఈళ్ళనాన్న అర్ధాంతరంగా లారీ క్రిందపడి, చచ్చిపోయాడు. పొట్టచేత్తో బట్టుకుని పిల్లల్తో కొత్తగా ఈ వూరొచ్చాను. నాకేందెలియదు. నువ్వు పొమ్మంటే ఈ చీకట్లో నే నెక్కడికి పోను? ఈ గంగమ్మని దేముడు చిన్నసూపు జూశాడు- నువ్వు కూడా నన్ను, కాదు పొమ్మంటావా, అన్నా!' అని దీనంగా ప్రాధేయపడి శోకాలు దీసింది గంగమ్మ.

'సర్లె. తెల్లారగానే ఎల్లిపోవాలిమరి. ఎల్లకపోతే వూరుకునేది లేదు. ఆఁ' అని వుదారంగా పర్మీసను ఇచ్చి ఆ రాత్రికి ఒక ప్రక్కన సర్దుకున్నాడు కనకయ్య. ఆడకూతురు గందా! పాపం కష్టాలలో మునిగి వున్నట్లువుంది. ఒక రేత్రికేం పోయిందిలే అనుకున్నాడు.

మర్నాడు.

ఉదయ సంధ్య వళ్ళు విరుచుకుంటూ వుండగా, పిల్లాడి ఏడుపుకి వులిక్కిపడి నిద్ర లేచాడు, కనకయ్య.

'లే. లే. పో. పొమ్మంటూ వుంటే' అని అరిచాడు నిద్ర లేస్తూనే.

చిరిగిన చొక్కా, మాసిన నిక్కరూ వేసుకుని వున్న ఒక పదేళ్ళ కుర్రాడూ, ఒక ఏడేళ్ళ కుర్రాడూ చిన్న చిన్న గుంటలు తీసి, కర్రలు పాతి, గుడ్డలు కప్పి టెంపరరీగా గుడారం తయారు చేస్తున్నారు. ఏడుస్తూ వున్న పసిపిల్లని వొళ్ళోవేసుకుని పాలిస్తూ వుంది గంగమ్మ.

'పోన్లే గదాని, దయదల్చి వేలు పెట్టనిస్తే కాలు పెట్టిన లే. లే. ఫో. ఫో.' అంటూ, కుంటికాలు ఎగరేస్తూ మీదమీదకి కనకయ్య. గంగమ్మ నిలువుగుడ్లు వేసుకుని చూసింది.

'అన్నా నువ్వు ఒంటరివాడవేగందా! ఈ నీడని మనం కుందాం, కాదనకు' బ్రతిమాలింది గంగమ్మ. 'నా పిల్లలు చిన్న నేను ఆడదాన్ని' అని సొద వెళ్ళబోసింది.

'అదేం కుదర్దు. లే. లే. పోండి. పోండి.' అని గదమాయిం కనకయ్య వీరుడిలాగ.

'పోండి. పోండి - అని నువ్వు కూడా అంటే ఎక్కడి పోతామన్నా?'

'అదేం నాకు దెలీదు. నువ్వు నీ పిల్లలూ ఈడనుంచి పో ల్సిందే. ఈ జాగా నాదీ.'

'అన్నా, అన్నా.' బ్రతిమాలింది గంగమ్మ. ఆమె బ్రతిమ కాళ్ళు పట్టుకున్నకొందీ చెలరేగిపోయాడు కనకయ్య. పిల్లకి పాలిస్తు గంగమ్మని, రాక్షసంగా జుట్టు పట్టుకుని లాగాడు. అటూ ఇ బలంగా గుంజాడు. వీపుమీద గుద్దాడు.

ఫెడేల్మని అంది, సడన్‌గా వెనకాల. కనకయ్య వీపు చు మంది.

కనకయ్య ఎగిరి పడ్డాడు. అదరిపోయాడు.

'అమ్మ. నీయమ్మ! సచ్చాన్రా' అని బాధగా అరిచా కనకయ్య.

గంగమ్మ పెద్ద కొడుకు చేతిలోని కర్ర మళ్ళీ పైకి లేచిం పౌరుషంగా.

'ఒరే! నీయమ్మ. కుర్రనాయాల! ఏంటిరా? నీ దౌర్జన్యం అని గుడ్లురిమాడు, కనకయ్య.

కర్ర మళ్ళీ ఫెడేల్మంది! కనకయ్య వీపు విమానం మో మ్రోగింది. ధయిర్యం జావగారిపోగా- 'అమ్మ దొంగనాకొడక సంపుతావంట్రా?!' అని కుంటికాలెగరేసి దూకాడు కనకయ్య 'తప్పురా.' ఒరే నాన్నా. ఆగరా. ఏంటిరా అది?' అని గంగమ్మ అంటూనే వుంది. కుర్రాడి చేతిలోవున్న కర్ర, ఆగలేదు. ఒక కాల పోయిన మిల్కాసింగులాగా, కనకయ్య పరుగు లంకించుకున్నాడు క్షణాలలో ఆ ప్రదేశం నుంచి అదృశ్యమయిపోయాడు కనకయ్య.

ఎండ మాడ్చేస్తూ వుంది.

వీపు చుర చుర మంటూ వుంది.

'అమ్మా! ఆకల్లో! ఇంత ముద్ద బడెయ్యి తల్లీ' అంటూ నోరు అర్చుకుపోయేటట్టు అరుస్తూ వీధులవెంట దిరుగుతున్నాడు

య్య. అరికాళ్లు పెనంమీద బెట్టినట్టు మండిపోతున్నాయ్. గాలి
ల్నీ బుట్టిస్తావుంది. సూరీడుకి దయ అన్నదే లేదు.

ఆపూటా ఏతల్లికీ దయ కలగలేదు, కనకయ్యమీద.

కనకయ్యకి ఇంత ముద్దయినా దొరకలేదు. ఇంతయినా దయ
ని ఈలోకం ఏమిలోకం ! తిరిగి తిరిగి వేసారి, అప్రయత్నంగానే
నిద్రగన్నేరు చెట్టు క్రిందకి వచ్చాడు కనకయ్య. బెరుకు బెరుగ్గా
ప్రక్కల పరకాయించి చూసాడు. నిశ్శబ్దంగా వుంది. గంగమ్మ
దాని కొడుకులు గానీ వున్నట్టు లేరు. కసిగా పళ్ళు పటపట
పించి క్రూరంగా చూసాడు కనకయ్య. ఆ గుడ్డల ఇంటిని పీకి
సి ఆ చెంబూ తపేలాల్ని అవతలకి విసిరేస్తే తనకి అడ్డు
దెవరూ ?

నిద్రగన్నేరు మొదలు చాటునుంచి ఇవతలికి వచ్చాడు- ఏడేళ్ళ
రాడు.

'ఒరేయ్ ! బుడ్డాయాలా ? ఇలారా.' గొంతులోపలికి,
నంత కర్కశత్వాన్ని రానిచ్చాడు కనకయ్య. ధయిర్యంగా
కయ్యని సమీపించి ఏమిటన్నట్లు కళ్లు ఎగరేసాడు, వాడు !

'నీ పేరేంట్రా ? ఆఁ! ' అని షోగ్గా కుంటికాలెగరేసాడు
కయ్య.

'నారాయణ'

'ఒహో ! ఆ దున్నపోతు పేరేంటి ?'

'దున్నపోతెవరూ ? !'

'ఆడే. నీ అన్ననాయాలు'

నారాయణ నవ్వు ఆపుకుని అన్నాడు- 'గగ్గయ్య'

'ఏడి అ గగ్గడు ? భయపడి పారిపోయాడా ?'

'ఊహూ'

'మరి ఎందుకు పారిపోయాడురా ?'

'పారిపోలేదు. సైకిలుషాపులో పనికి కుదిరాడు. రోజుకి ఐదు
రూపాయలు.'

'పనిచేసి మిమ్మల్ని పోషిస్తాడన్నమాట ! ఎధవ సన్నాసని !
న్నాసి మెమ్మేదీ ?'

'తనూ పనికి బోయింది'

'ఒరే ! దానికేం పనొచ్చురా ? నాకు తెలవక అడుగు
న్నాను, జెప్పు.'

'అంట్లు తోముతుంది. ఇళ్లు, వాకిళ్ళు వూడుస్తుంది. నీళ్ళు
డుతుంది...ఇంకా...'

'దొడ్లు ఎత్తదూ? ఛి. ఛీ. ఇయ్యేం పన్లురా? ముండనాయాల'

'బతకటానికి ఏదో ఒక పని చెయ్యాలిగందా !'

'అయితే మాత్రం...!'

'అడుక్కు-తినడం కంటే నయమేగందా !'

కనకయ్యకు కోపం పొంగుకు వచ్చి కళ్లు ఎర్రబడ్డాయి. కుర్ర
వెధవ నీతులు వల్లిస్తున్నాడు.

'నీయమ్మ ! నన్నే దెప్పిపొడుత్తావంట్రా ? ! బుడ్డనాయాల !
వుప్పుడు నీ ఈబ్బలగొట్టి, ఈ చెంబూ తపాళా ఎత్తుకుపోయి అమ్ము
కుంటే నీకు దిక్కెవర్రా ?

'అది వల్లగాదు.'

'ఎందువల్ల గాదురా? ఏమిటా ధయిర్యమూ? ! చెప్పు వింటా'

'అటుజూడు ! ఆ ఎదురుగా వున్న సైకిలుషాపులోంచి, మా
యన్న ఇదంతా చూస్తానే వున్నాడు. పిచ్చిపన్లు చేసావంటే, ఆడు
లగెత్తుకొచ్చి, నీ 'శావ' జేస్తాడు. జాగ్రత్త.'

కసిగా వూశాడు కనకయ్య.

'నీయమ్మ ! ఆ రాక్షసుడు పీడ నాకు వదల్లేదన్నమాట !
ఇదుగో, విను. ఆడు ఇట్టాగే ఆ దవుర్జన్యం కొనసాగిత్తే యల్లకాలమూ
సాగదు. ఎప్పుడో - ఇంతకి ఇంతా అనుభవిస్తాడు. ఒక పెద్దా చిన్నా
వుండాలి. మంచీ మర్యేదా కావాలి. న్యాయం అన్యాయం చూడాలి.
తెలుసునా ?

'అయన్నీ నువ్వు గూడా గమనించాలి గదా ! రూల్సంటే
నీకయినా, మాకయినా ఒకటే గందా.'

'నీయమ్మ ! నీతో నాకెందుగ్గానీ, ఇదుగో తిరిగి తిరిగి నా
కాళ్లు నెప్పులు పెట్టున్నాయి. కాసేపు నేను ఇక్కడ కూర్చోవచ్చునా?
వెంటనే నాకు సమాధానం గావాలి మరి !'

'కూర్చో. అందులో పోయిందేముంది ?'

కనకయ్య ఇంత నీడ చూసుకుని కూలబడ్డాడు.

వంట్లో నరాలు లాగాయి. ప్రేగులు గుడగుడ మన్నాయి.
కడుపులో ఆకలి చెలరేగింది. కండరాలు నిస్సత్తువగా మూలిగాయి.
అన్నం కోసం మూడు దినాల్నుంచీ ఒకటే తపన !

లాగూ జేబులోనించి ఒక డాగు మామిడికాయని దీసి చీకటం
మొదలుపెట్టాడు నారాయణ,

కనకయ్య నోరూరింది.

కనకయ్య మనస్సు గిలగిలలాడింది. కడుపులోవిప్లవంచెలరేగింది

'ఒరే! నారాయణా!'

'ఏం ?'

'నువ్వు మంచాడివిలాగే వున్నావురా. నాకాస్త పెట్టవంట్రా?'

నారాయణ మవునంగా తింటం కొనసాగించాడు.

'ఇవతలనేను ఆకల్తో నకనకలాడి పోతావుంటే, నువ్వు ఒక్కడివే ఎట్టా తింటావురా? నారాయణా. మూడురోజులయి నేమ అన్నందినలేదురా. నేను ఆకలితోమాడి సచ్చిపోవటం నీకు ఇష్టమంట్రా ఆలోచించుకొని జెప్పు.

సగం తిన్న డాగు మామిడికాయని, కనకయ్యకి అందించి, పంపుదగ్గిరికి మూతి కడుక్కోటానికి వెళ్ళాడు నారాయణ. ఆబగా ఆ కాయని చీకి, పూర్తిగా నాకేసి, టెంకని విసిరేసాడు కనకయ్య. మూతిని లాగుకు తుడుచుకుంటూ వచ్చాడు నారాయణ.

'ఓరి నారాయణా! నువ్వు మంచాడివేరా. నీయన్న, ఆగగ్గడే దుర్మార్గుడురా'

'...'

'అనవసరంగా నా ఈపు పగలగొట్టాడు. అవాతలు ఇంకా సలుపుతా వున్నయిరా'

'...'

'ఒరే! నేను పెద్దమనిషినిగదా! వాడు అట్టా నామీద దవ్వర్జన్యం చెయ్యచ్చునా? నువ్వేచెప్పు!

'ఆడదనయినా ఆలోచించకుండా నువ్వు ఎగబడి, మా యమ్మ జుట్టుపట్టుకొని కొట్టడం దవ్వర్జన్యంకాదా? ఒక పెద్దమనిషి అట్టా చేయగలడా పెద్దాయనా?'

'ఓర్నీయవ్వ! నిజమేగందా! నేను మాత్రం ఎట్టా కాదం టానురా ? తప్పే ?'

'అందుకే – అన్న కోపం పట్టలేక నీ 'శావ' జేసాడుగాని, మాయన్న చాలా మంచాడు అసలు.'

'సర్లేరా నేను మాత్రం ఎందుకాదనాలి ? మనం అందరమూ మంచినాయాళ్ళమే ! దురుమార్గాన్ని దూరంగా వుంచి, మంచిగానే, మసలుకుందాం. అందరం ఈ చెట్టుక్రిందే వుంటూ కలిసి మెలిసి ఇకపయిన వుందాం. ఏమంటావు ?

'ఆ సంగతి నువ్వు మమ్మతోనూ, మన్నతోనూ, మాట్లాడు. నాకేం దెల్సు ? నేను బుడ్డనాయాల్ని,'

'సర్లేరా. నారాయణా. నువ్వు జెప్పినదేన్ని నేను కాదన్నానూ! నేనిట్టా అన్నానని, నువ్వు ఆళ్ళకి జెప్పు ఆ తర్వాత ఆళ్ళతో నేను మాట్లాడతాలే' అని కనకయ్య లేచాడు. కాలు ఎగరవేస్తూ, ఆ ఎండను బజార్న పడ్డాడు. చుక్కాని విరిగిన నావలా సాగిపోయాడు.

పంపు దగ్గర కుండతో ఇన్ని నీళ్ళుదెచ్చి, పిల్లదాన్ని తోమి, నారాయణ కప్పగించి, ఏరి, మూడురాళ్ళు చేర్చి, పొయ్యి వెలిగించి, మూటలోంచి ఇన్ని బియ్యం దీసి వుడకేసింది గంగమ్మ.

ప్రొద్దుగూకింది. ఆకలో అంటూ ఎగబడ్డారు పిల్లలు. కడుపులో ఇంత ముద్ద బడకపోతే వాళ్ళు పెరపెరలాడతారు. దేముడు దయ గలిగినవాడు. తనకి నాలుగిళ్ళు పనికి దొరికాయి. గగ్గయ్యకి ఒక పని దొరికింది. పర్వాలేదు. చీకటిలో తడుములాడుకుంటూవున్న తనకి ఒకదారి దొరికింది.

ఏదో ఒకలాగా బ్రతుకు బండి నడిచి, ఈ పిల్లలు పెద్దవాళ్ళయితే అదే పదివేలు !

'నారాయణా ! పిల్లని ఇట్టా ఇచ్చి స్తానం చేస్తారా బాబూ! అన్నయ్య రాగానే అన్నం పెడతాను' అంది గంగమ్మ. పిల్లని తల్లి కందించి, పంపుదగ్గరకి పోయాడు నారాయణ.

బరువుగా అంగలు వేసుకుంటూ అ చీకట్లో తల్లి దగ్గరకి వచ్చి నిలిచాడు గగ్గయ్య.

'అమ్మా !'

'ఏంట్రానాన్నా ? ఆ బుజాన్న ఏమిటి ?' అంది గంగమ్మ. చీకట్లోకి కళ్ళు చించుకుని చూస్తూ.

తన బుజాన్న ఉన్న బరువును దించాడు గగ్గయ్య.

'కొద్దిగా నీళ్ళూ, ఇంత అన్నమూ పెట్టమ్మా. త్వరగా కావాలి'

'ఎవర్రా అది ? ఏమయిందీ?'

'పాపం ! ఆకలికి తాళలేక మన కుంటి కనకయ్య, మా సైకిలుషాపు ముందు పడిపోయాడమ్మా ! తీసుకొచ్చాను !

ఆకలి ఎటువంటిదో, ఆ బాధ అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది ఆ మాట వినగానే చటుక్కున లేచి, గిన్నెలో అన్నము పెట్టుకొని, చెంబుతో నీళ్ళుతెచ్చి, గగ్గయ్యకి అందించింది గంగమ్మ.

కుంటాడ్ని వళ్ళో పడుకోబెట్టుకుని రొండు ముద్దలుబెట్టి, ఇన్ని నీళ్ళు త్రాగించాడు గగ్గయ్య. గుటకలేసి తిని, మ్రింగి- వళ్ళు మళ్ళీ దారికిరాగా–

లేచి పోబోయిన ప్రాణం తిరిగిరాగా– శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుని, నిమ్మదిగాలేచి కూర్చున్నాడు కనకయ్య. కళ్ళుతెరిచి పరకాయించి చూసాడు.

'ఎవడ్రా నువ్వు?'– అని అడిగాడు.

'నేను గగ్గయ్యని.'

'ఒరె. గగ్గయ్యా! అయితే -నన్ను సంపేత్తావంట్రా నువ్వు !? నేనసలే మంచి గాడిదకొడుకుని గాదురొరేయ్ ! డొక్కచించి పేగులు మెడలో వేసుకుంటాన్రా ! నా జాగాకాజేసి నన్నే కొడతావంట్రా ? ఒరేయ్!'– ఆక్రోశించాడు కనకయ్య.

'అన్నా! ఏ మడిసికయినా, చివరికి అవసరమయ్యేది ఆరడుగుల జాగా. కడుపులునింపు కోవటానికే వెంపరలాటలుపోయే మనలాటి వాళ్ళకి, జాగాలనిగురించి తగువులేల? అన్నా! నీకిష్టం లేక పో అట్లాగే మేమెళ్ళిపోతాంగానీ, సావబోయిన నిన్ను మళ్ళీ బ్రతిక నందుకా, మళ్ళీ నా బిడ్డమీదకి కాలు దువ్వుతున్నావ్!? అన్నా! నీ తగదు!' అంది గంగమ్మ.

'నేను సావబోయానా ? గంగమ్మా!'

'అవును ఆకలికి తాళలేక నువ్వు రోడ్డుమీద బడిపోతే, నా నిన్ను మోసుకొచ్చి నీకు ప్రాణం పోశాడు. అందుకని నువ్వు మ బాగా జవాబుచెప్తున్నావ్!'

గగ్గయ్యని వాటేసుకుని చిన్నపిల్లాడిలాగా, బావురుమ బిగ్గరగా విలపించాడు కనకయ్య.

ఆర్ద్రత ?

అడుగడుగునా అడ్డుపడే
వైఫల్యాల చరిత్రను
ఎడగాలి కాలికి తగిలేకంకరరాళ్ళనే!
కాయాకష్టంకింద మొద్దుబారిన
రోజువారి మృత్యురహస్యం
ఆ కంకరకొట్టే చేతుల్లోనే.

కాస్సేపు కిటికీలో నిలుచునే
స్థిర చిత్రంలా ఆ నెలవంక,
ఎండాకాలంలో సందులోంచి
శరీరాన్ని పలకరించే
సాయంత్రపు చల్లని రివటుగాలి
స్నేహాలకు ఎలాంటి హద్దులు కలవని
మంచి మనసులకోసమే అన్వేషణ.

మతాల కుత్రులు కుహకాలు
స్వల్ప బేధాభిప్రాయాలు
సృష్టించే అగడ్తలకు..
అతీతంగా కలిగే ఆర్ద్రత
ఎక్కడని వెతకను ?

తల్లీకొడుకుల అనుబంధం
భార్యా భర్తల అనురాగం
అన్నా చెల్లెల ఆప్యాయతలు
అన్నీ ఈ రోజువారి లెక్కల్లో
గొప్పతనాన్ని చాటుకుంటున్న-
వస్తువుల్లో నిబద్ధమైన విలువలతో
సిగ్గు విడిచిన ఈ తరుణంలో
వాడుకలోకి వచ్చిన కొత్తనుడికారం